
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 16 । మార్చి । 2025



సోమశిలలో 55.534 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 55.534 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.90,770
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,220
3శాతం జీఎస్టీతో	రూ.8,467
నవర (8గ్రా)	రూ.67,736

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.7 /24.6


జిల్లాలో వాతావరణం ఆదివారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 62 శాతంగా నమోదైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆదివారం	సోమవారం
సా: 6.21	ఉ: 4.56

పశు వైద్యానికి... ఇక సెలవు

గ్రామీణ ప్రాంత ప్రజల ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయం తర్వాత పాడిపరిశ్రమే. పల్లెలో రైతుల జీవన ప్రమాణాలు మెరుగు పడాలంటే పాడి, పంటలు ఎంతో ముఖ్యం. వ్యవసాయం కలిసి రాక పోయినా పాడి ద్వారా కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. అటువంటి పాడి పశువులకు అత్యవసర వైద్య సేవలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఇందు కోసం సంచార అంబులెన్స్‌లను నియోజకవర్గానికి రెండు చొప్పున ఏర్పాటు చేసింది. వీటితో ఇంటి వద్దనే వైద్యం, మెరుగైన వైద్యం అవసరమైతే ఆస్పత్రికి తరలించేందుకు వీలుగా అంబులెన్స్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఈ సేవలను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది.





- సంచార అంబులెన్స్‌ల నిలిపివేత
- పాడి రైతులకు శాపంగా పరిణమించిన ప్రభుత్వ నిర్ణయం
- వైద్యులు, టెక్నీషియన్, ఫార్మసిస్టులు, పైలట్ కొలువులు గోవిందా
- గత ప్రభుత్వ పథకాలపై కూటమి సర్కార్ కక్ష

ఉదయగిరి: పశువుల అత్యవసర వైద్య సేవలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతోంది. గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఒక్కొక్క పథకాన్ని అటకెక్కిస్తోంది. ఆయా కార్యక్రమాల ప్రయోజనాన్ని పరిగణలోకి తీసుకోకుండా కక్ష పూరితంగా పథకాలను నిర్వీర్యం చేస్తోంది. అందులో భాగంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దనే పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించే సంచార పశువైద్య అంబులెన్స్‌ల సర్వీసులకు స్వస్తి పలుకుతోంది. తాజాగా ఈ నెల మొదటి నుంచి ఉమ్మడి జిల్లాలో 9 అంబులెన్స్ సర్వీసులు ఆగిపోయాయి. అందులో పని చేసే వైద్యులు, టెక్నీషియన్, ఫార్మసిస్టులు, పైలట్‌లను ఇంటికి పంపింది.

కూటమి సర్కార్ కక్ష ధోరణి

చంద్రబాబు సర్కార్ పాడిపై ఆధారపడే పశుపోషకులను వదలడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2021లో మొదటి విడతలో 9, రెండో విడతలో 10 వాహనాలు మంజూరు చేసింది. ఒక్కొక్క వాహనంలో వైద్యులు, టెక్నీషియన్, ఫార్మసిస్టులు, పైలట్ కలిపి నలుగురు ఉంటారు. మారుమూల గ్రామాల్లోనూ పశువులకు అత్యవసర వైద్య సేవలు అవసరమైతే 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే అంబులెన్స్‌లు నేరుగా ఇంటికి వెళ్లి వైద్య సేవలందిస్తాయి. వీటి నిర్వహణ రాష్ట్ర వ్యాప్తంగా జీవీకే ఫౌండేషన్‌కు అప్పగించింది. దీనికి గత నెలలో గడుపు ముగిసింది. దీంతో మార్చి 1వ తేదీ నుంచి మొదటి ఫేజ్‌లో మంజూరైన 9 అంబులెన్స్‌లు నిలిపి వేసి అందులో పనిచేసే వారిని ఇంటికి పంపారు. కారణంగా పశు వైద్యసేవలు ఆగిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్కార్ వైఖరిపై మండి పడుతున్నారు.

అంబులెన్స్‌లు ఆపడం కక్ష సాధింపు చర్యే



అత్యవసర పశు సంచార వైద్య సేవలు ఆగిపోవడంతో పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పుడు పశువులకు ఆరోగ్య సమస్య వస్తే ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పశు వైద్యశాలకు తీసుకెళ్లాలి. గత ప్రభుత్వంలో 1962 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే ఇంటికి వచ్చి వైద్యం చేసే పరిస్థితి ఉండేది. కానీ ఈ ప్రభుత్వం ఆ సేవలు ఆపివేయడం ముమ్మాటికి కక్ష సాధింపు చర్యే.

– సురేష్, జనార్దనపురం

గత ప్రభుత్వంలో మెరుగైన సేవలు

పాడి రైతుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంచార పశు వైద్య అంబులెన్స్ వ్యవస్థ ప్రవేశ పెట్టారు. అత్యాధునికంగా హైడ్రాలిక్ సిస్టమ్‌తో పశువులను నేరుగా అంబులెన్స్‌లోకి ఎక్కించి ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యసేవలు అందించి తిరిగి తీసుకువచ్చి దించే విధంగా వీటికి రూపకల్పన చేశారు. వీటి ద్వారా రైతులకు పైసా ఖర్చు లేకుండా ఇంటి వద్దనే వైద్యం అందేది. ఒక్కొక్క నియోజక వర్గానికి 2 చొప్పున కేటాయించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొదటి దఫా 9 వాహనాలు, రెండో దఫా మరో 10 వాహనాలను కేటాయించారు. దీంతో వేలాది మంది పశుపోషకులకు మేలు జరిగింది. ఈ సర్వీసు ప్రజాదరణ పొందింది. అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ సర్వీసులను నిర్వీర్యం చేయడంతో పాడిపై ఆధారపడే రైతులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహంతో ఉన్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిలిపివేశాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం మొదటి ఫేజ్‌లో ఉన్న 9 వాహనాలను నిలిపివేశాం. వీటికి నిర్వహణ ఏజెన్సీ కాల పరిమితి పూర్తి కావడంతో ఫిట్‌నెస్ పరిశీలన చేయమన్నారు. అది కూడా చేస్తున్నాం. తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌నాయక్, జేడీ పశుసంవర్ధక శాఖ

న్యూస్‌రీల్

18న కోవూరు, ఆత్మకూరులో జాబ్‌మేళా

నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 18న కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు ఎస్వీ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ప్రముఖ కంపెనీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 73823 91116, 9491284199 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రెండు కొత్త బస్సు సర్వీస్‌లు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, అధికారులు

నెల్లూరు సిటీ: నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో రెండు కొత్త బస్సు సర్వీసులను శనివారం ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ప్రారంభించారు. నెల్లూరు నుంచి పొదిలికి వయా పామూరు మీదుగా ఎక్స్‌ప్రెస్ సర్వీసు, అంబాపురం టిడ్కో నుంచి రాజుపాళెం వరకు పల్లె వెలుగు సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజా రవాణా అధికారి మురళీబాబు, డిపో మేనేజర్ మురళీకృష్ణ, శివకేశవ్‌యాదవ్ పాల్గొన్నారు.

14 మంది ఉపాధి సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

- అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు : డ్వామా పీడీ గంగాభవాని
- రూ.30,52,734 రికవరీకి ఆదేశాలు
- ఇందులో పీఆర్ శాఖ నుంచి రూ.3,71,832



బహిరంగ ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

సీతారామపురం: ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన 14 మంది సిబ్బందిపై సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికలోనే శనివారం సస్పెన్షన్ వేటు వేస్తూ డ్వామా పీడీ గంగాభవాని చర్యలు తీసుకున్నారు. సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని పీడీ హెచ్చరించారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద శనివారం నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ.8,35,69,875తో 649 రకాల ఉపాధి పనులు చేయగా వాటిపై సోషల్ ఆడిట్ బృంద సభ్యులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి విచారణ చేపట్టి తుది నివేదికను పంచాయతీల వారీగా వెల్లడించారు. చాలా గ్రామాల్లో ఒకే కుటుంబంలో రెండు, మూడు జాబ్‌కార్డులు ఉన్నాయని, ఉపాధి హామీ పనుల్లో చాలా తేడాలు ఉన్నాయని, పని తక్కువగా ఉందని, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, కొలతల ప్రకారం పనులు జరగలేదన్న వంటి విషయాలను సామాజిక తనిఖీ బృంద సభ్యులు అధికార యంత్రాంగం దృష్టికి తీసుకు వచ్చారు. వాస్తవాలను పరిశీలించిన డ్వామా పీడీ విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఏపీఓ సుభాషిని, ఈసీ సువార్తయ్య, ముగ్గురు టీఏలు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లతోపాటు ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక సీనియర్ మేట్ ను సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. 14 పంచాయతీల్లో రూ.30,52,734 రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, ఏపీడీ శంకర్‌నారాయణ, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎంపీపీ పద్మావతి, ఎంపీడీఓ భాస్కర్, ఈఓపీఆర్డీ భార్గవి తదితరులు పాల్గొన్నారు



శుక్రవారం సాయంత్రం రథోత్సవం వద్ద ఈఓ రాధాకృష్ణతో వాగ్వాదం పడుతున్న భక్తులు

ఈఓ నిర్లక్ష్యానికి పరాకాష్ట

- రథోత్సవం నిలిచిపోవడంపై భగ్గుమంటున్న భక్తులు
- ఈఓ, అతని సోదరుడికి వ్యతిరేకంగా నినాదాలు
- ఈఓని బదిలీ చేసి విచారణ చేపట్టాలని డిమాండ్

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బిలకూట క్షేత్రంలో కొలువైన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణలో దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై భక్తులు భగ్గుమంటున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిష్టాత్మకమైన రథోత్సవం ప్రారంభమైన వెంటనే నిలిచిపోవడం ఈఓ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని అంటున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణ, అతని సోదరుడు రాంబాబులు కొండపై తిష్టవేసి క్షేత్ర వైభవాన్ని, ప్రాశస్త్యాన్ని మంటగలుపుతున్నారని పాతబిట్రగుంట, కొండబిట్రగుంట గ్రామస్తులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. స్వామివారి కల్యాణోత్సవం అనంతరం నిర్వహించే రథోత్సవం అధికారుల తప్పిదం కారణంగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. రథం చక్రాల వద్ద సమస్యలు తలెత్తి రథోత్సవం ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే రథం కదలకుండా నిలిచిపోవడంతో భక్తుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. 2023లో రథోత్సవం సందర్భంగా రథం ఒక పక్కకు ఒరిగిపోవడం, ఈ దఫా అసలు కదలకపోవడంతో భక్తులు కలత చెందారు. ఫిట్‌నెస్ పరిశీలించకుండా, ట్రయల్ రన్ నిర్వహించకుండా రథాన్ని ఒకేసారి రథోత్సవానికి సిద్ధం చేయడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శిస్తున్నారు. ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్వామివారి సేవల్లో వరుసగా ఆటంకాలు ఏర్పడుతున్నాయంటూ రథం వద్దే అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈఓ రాధాకృష్ణ డౌన్‌డౌన్, రాంబాబు డౌన్‌డౌన్ అంటూ భక్తులు నినాదాలు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. భక్తులకు, పాతబిట్రగుంట, కొండబిట్రగుంట గ్రామస్తులకు సర్దిచెప్పి శాంతింపచేసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. పోలీసుల జోక్యంతో అప్పటికి భక్తులు శాంతించినా, ఈఓని మాత్రం తక్షణమే బదిలీ చేయాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా పెత్తనమంతా కావలికి చెందిన ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టారని, కొండపై స్వామివారి సేవకన్నా ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీ ఎక్కువగా ఉందని ఆరోపిస్తున్నారు. వీఐపీ పాస్‌లు ఇష్టారాజ్యంగా కేటాయించడంతో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శిస్తున్నారు. తక్షణమే ఈఓని బదిలీ చేసి రథోత్సవం వైఫల్యంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

అంతా ఇష్టారాజ్యమే

బిలకూట క్షేత్రంలో రెండేళ్లుగా అధికారుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. ఈఓ సోదరుడు కొండపైనే తిష్టవేయడం, స్వామివారి సన్నిధిలో పెళ్లి చేసుకోవాలనుకునే పేదలు, భక్తులు ఈఓ సోదరుడి దయాదాక్షిణ్యాలపైన ఆధారపడాల్సి రావడంతో పాటు అంతా వ్యాపారంగా మారిపోవడంతో తరచుగా విమర్శలు వినిపిస్తున్నాయి. వీటితోపాటు బిలకూట క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, దాతల విరాళాలను కూడా గోప్యంగా ఉంచడం, బ్రహ్మోత్సవాల సమయంలో కూడా ఇదే నిర్లక్ష్యాన్ని, గోప్యతను పాటించడంపై పాత బిట్రగుంట, కొండబిట్రగుంట గ్రామస్తుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. ఉత్సవాల్లో స్వామి వారిని తమ భుజాలపై మోసే మోతగాళ్లు కూడా ఈఓ వైఖరిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వివాదం మరింత ముదిరి బిలకూట క్షేత్రం ప్రతిష్టకు మచ్చ రాకముందే అధికారులు ఈఓని బదిలీ చేసి ఆలయ వ్యవహారాలను చక్కదిద్దాలని కోరుతున్నారు.

అగ్రిగోల్డ్ సంపద దొంగలను వదలం

- అవినీతి అధికారులకు అరదండాలు తప్పవు
- వరికుంటపాడులో అగ్రిగోల్డ్ భూముల పరిశీలన
- మాజీ మంత్రి కాకాణి, మేకపాటి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి, మేరిగ



కనియంపాడులో అగ్రిగోల్డ్ భూముల్లో నరికిన జామాయిల్ చెట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ జామాయిల్, ఎర్రచందనం సంపద దోచేసిన దొంగలను వదలమని, వారి నుంచి ప్రతి పైసా వసూలు చేసి అగ్రిగోల్డ్ బాధితులకు అందజేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఆయన శనివారం ఉదయగిరి నియోజవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీతో కలిసి వరికుంటపాడు మండలం కనియంపాడు, భాస్కరాపురంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో కొట్టేసిన వృక్ష సంపదను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ హేమంత్‌కుమార్‌ను కలిసి అగ్రిగోల్డ్ భూముల్లో పట్టపగలే వృక్ష సంపదను దోపిడీ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కాకాణి మాట్లాడుతూ 2014 చంద్రబాబు పాలనలో అగ్రిగోల్డ్ కుంభకోణం వెలుగు చూసిందని, దీనికి బాధ్యులైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాడినా పట్టించుకోకుండా కంపెనీ యాజమాన్యంపై వల్లమాలిన ప్రేమ చూపించారన్నారు. కోర్టుల జోక్యంతో సీబీఐకి అప్పగించారన్నారు. తమకు న్యాయం జరుగుతుందని బాధితులు భావిస్తున్న తరుణంలో 15 ఏళ్లుగా 70 ఎకరాల్లో పెరిగిన రూ.3.5 కోట్ల విలువ చేసే సంపదను టీడీపీ నేతలు నరికి సొమ్ము చేసుకున్నారన్నారు. ప్రభుత్వ అధీనంలోని సీఐడీ జప్తు చేసిన సొమ్మును పట్టపగలు దోచేస్తే చర్యలు తీసుకోకుండా పేద ప్రజలకు ఈ ప్రభుత్వం ద్రోహం చేస్తుందన్నారు. అధికారులు, పోలీసులు దొంగలను పట్టుకోవడం మానేసి మమ్మల్ని నివారించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై ఎప్పుడూ ఇంతగా వేధించిన పరిస్థితులు లేవు. జిల్లాలో కలెక్టర్, ఎస్పీలు ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని పోలీసులు, రెవెన్యూ అధికారులు గుర్తించుకోవాలన్నారు. మాకు అధికారం వచ్చిన తర్వాత ఎక్కడ ఉన్నా ఎవరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. ఉద్యోగ విరమణ చేసినా జైలుకు పంపించడం ఖాయమన్నారు.



తహసీల్దార్ హేమంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న నాయకులు

సంపద సృష్టించడం అంటే దోపిడీనా?

సంపద సృష్టించడం అంటే దోపిడీనా అని ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నిలదీశారు. పట్టపగలే అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ నరికి తీసుకెళ్తుంటే వ్యవస్థలు చేష్టలుడిగి చూస్తున్నాయని విమర్శించారు. అధికారులు తప్పులు చేసి బలికావద్దు. తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని, భవిష్యత్‌లో కార్యకర్తల మాటే జగన్ చర్యగా ఉంటుందని గ్రహించాలన్నారు. ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు దిగమింగినదంతా కక్కించి బాధితులకు అందజేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు

అగ్రిగోల్డ్ భూములు పరిశీలించేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసుల ద్వారా అడ్డుకునేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నించారు. పోలీసులు సివిల్ డ్రెస్‌లో పహారా కాశారు. పోలీసులు అడ్డంకులు, ఆంక్షలు విధించినా లెక్క చేయకుండా క్షేత్ర పర్యటన చేసి, జామాయిల్ కర్రను నరికి సొమ్ము చేసుకున్న టీడీపీ నేతల వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు షేక్ అలీ అహ్మద్, ఎం. తిరుపతినాయుడు, సిద్ధయ్య, గుర్రం భాస్కర్‌రెడ్డి, ఎం.మురళీకృష్ణ, అంజనేయులు, చెన్నారాయుడు, మున్నంగి శ్రీనివాసులు, బొడ్డు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అలవి వలలతో వేట సాగిస్తే చర్యలు

- మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు
- అధికారుల ముందే ఇరువర్గాల మత్స్యకారుల వాగ్వాదం

సోమశిల: సోమశిల జలాశయంలో అలవి వలలతో వేట సాగిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు మత్స్యవేటకారులను హెచ్చరించారు. జలాశయం వెనుక భాగంలో నిషేధిత అలవి వలలతో వేట సాగుతుందని స్థానిక మత్స్యకారులు ఫిర్యాదు చేయడంతో శనివారం జేడీ నాగేశ్వరరావు తనిఖీ చేశారు. అధికారులతో కలిసి జేడీ జలాశయం నుంచి పడవలో వెనుక భాగం వరకు వెళ్లి పరిశీలించారు. అలవి వలలతో వేట సాగించే ప్రదేశానికి వెళ్లగా అక్కడ వాటికి సంబంధించిన ఎటువంటి ఆనవాళ్లు లేకపోవడంతో వెనుదిరిగి వచ్చారు. అనంతరం ఫిర్యాదు చేసిన మత్స్యకారులతో జేడీ మాట్లాడుతుండగా మత్స్యకారుల్లోని ఇరువర్గాలు వాగ్వాదానికి దిగారు. జేడీ వెంట మండల మత్స్యశాఖ అధికారి చందన తదితరులు ఉన్నారు.



పడవలో జలాశయం వెనుక భాగానికి వెళ్తున్న మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, అధికారులు

ప్రజలందరి సహకారంతో స్వచ్ఛాంధ్ర లక్ష్యం

- ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి
- కలెక్టర్ ఆనంద్
- ప్రజలకు క్లాత్ బ్యాగ్‌లు పంపిణీ చేసిన కలెక్టర్, కమిషనర్

నెల్లూరు (బారకాసు): ప్రజలందరి సంపూర్ణ సహకారంతోనే స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ ఆనంద్ అన్నారు. శనివారం నగరంలోని తడికల బజార్ సెంటర్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో కలెక్టర్ ఆనంద్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ పాల్గొన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రజలందరూ కంకణ బద్ధులు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో రోడ్ల నిర్మాణంలో కూడా ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్ వినియోగించనున్నట్లు చెప్పారు.

ప్లాస్టిక్ వాడకం కేన్సర్‌కు కారణం : కమిషనర్ సూర్యతేజ

ప్లాస్టిక్ వాడకం మన ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి కూడా అత్యంత హానికరమని, కేన్సర్‌కు కారణమని మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ అన్నారు. నగరంలోని 54 డివిజన్లలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్లాస్టిక్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులు భూమిలో కరగవని, వీటిని కాల్చితే ఆ గాలి పీలిస్తే క్యాన్సర్ ప్రబలుతుందని అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బయోడిగ్రేడ్ కవర్లు, జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులను వినియోగించాలని ప్రజలకు సూచించారు. అనంతరం స్థానికులకు క్లాత్ బ్యాగులను కలెక్టర్, కమిషనర్ పంపిణీ చేశారు. స్టోన్‌హౌస్‌పేటలో పర్యటిస్తూ ప్రజలకు, దుకాణదారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను కలెక్టర్, కమిషనర్ వివరించారు. ప్రజలందరితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. తొలుత ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలను వివరిస్తూ దోర్నాల హరిబాబు, శంకర్ స్కిట్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కామాక్షి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్, కమిషనర్



క్లుప్తంగా

ఎంబీబీఎస్ సీటు పేరుతో మోసం

నెల్లూరు(క్రైమ్): ఎంబీబీఎస్ సీటు పేరిట మోసగించి రూ.లక్షలు కాజేసిన ఇద్దరు వ్యక్తులపై నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. రామ్మూర్తినగర్‌లో రెడ్డి కృష్ణ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన తన కుమార్తె నీట్ రాయడానికి దరఖాస్తు చేసేందుకు హరనాథపురంలోని ఓ డిజిటల్ సేవా కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ విజయకుమార్ అతని సోదరుడు సునీల్ పరిచయమయ్యారు. కృష్ణ కుమార్తె సర్టిఫికెట్లను పరిశీలించిన వారు ఇక్కడ సీటు రాదని, కర్ణాటక రాష్ట్రంలో తెలుగు మైనార్టీ కోటా కింద తక్కువ ధరకే ఇప్పిస్తానని నమ్మబలికారు. వారు కృష్ణ వద్ద రూ.27 లక్షలు తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా సీటు ఇప్పించకపోవడంతో బాధితుడు వారిని నిలదీశాడు. దీంతో రూ.3 లక్షలు మాత్రమే తిరిగిచ్చారు. కృష్ణ వారి గురించి ఆరాతీశాడు. అప్పటికే ఇద్దరిపై నెల్లూరు నగరంలోని వేదాయపాళెం, దర్గామిట్ట తదితర పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయని తెలిసింది. మోసపోయామని గ్రహించిన కృష్ణ బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్వేపల్లి కాలువలో పడి లారీ క్లీనర్ మృతి

నెల్లూరు(క్రైమ్): సర్వేపల్లి కాలువలో పడి లారీక్లీనర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని రంగనాయకులపేట రైలు వీధికి చెందిన సయ్యద్ ఖాసీం అలియాస్ పెద్ద ఖాసీం (60) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మద్యం మత్తులోనో.. ఇతర కారణమో తెలియదు గానీ ఆయన శుక్రవారం రాత్రి శెట్టిగుంటరోడ్డు సమీప సర్వేపల్లి కాలువగట్టుపై నిద్రించాడు. కొద్దిసేపటి అనంతరం పైకి లేచే క్రమంలో అదుపుతప్పి కాలువలో పడ్డాడు. ఈ విషయంపై సమాచారం అందుకున్న కుమారుడు అబ్బాస్ అలీఖాన్ స్థానికుల సహాయంతో తండ్రిని రక్షించేందుకు యత్నించాడు. ఫలితం లేకుండా పోయింది. శనివారం ఖాసీం మృతదేహం లభ్యమైంది. అలీఖాన్ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రెహమాన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్ హత్య కేసులో దర్యాప్తు వేగవంతం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఇందిరాగాంధీ నగర్‌లో దారుణ హత్యకు గురైన రౌడీషీటర్ సుజన్ కృష్ణ అలియాస్ చింటూ హత్య కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. పాతకక్షలతోనే హత్య జరిగినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి చింటూకు ఇందిరాగాంధీనగర్‌కు చెందిన తన స్నేహితుడి వద్ద నుంచి ఫోన్ రావడంతో అక్కడికి వెళ్లగా కొందరు వ్యక్తులు కత్తులతో విచక్షణా రహితంగా నరికి హత్య చేసి పరారైనట్లు తెలిసింది. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులురెడ్డి తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

రేపటి నుంచి ప్రారంభం

- ఏర్పాట్లు చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు
- జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహణ
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- సమస్యల పరిష్కారం కోసం కంట్రోలురూమ్ ఏర్పాటు

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 31వ తేదీ వరకు ఇవి జరుగుతాయి. దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా గాలి, వెలుతురు, పూర్తిస్థాయిలో బెంచీలుండేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే హాల్ టికెట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో అందుబాటు ఉంచారు. దీంతోపాటు ప్రభుత్వ వాట్సాప్ నంబర్ 95523 00009కు విద్యార్థి వివరాలు పంపి హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవకాశం కల్పించారు. ఎగ్జామ్స్‌ను జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించనున్నారు. అలాగే విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చు.

బాలికలే అధికం

జిల్లా వ్యాప్తంగా 33,434 మంది (బాలురు 16,250 మంది, బాలికలు 17,184 మంది) విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 174 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 16 కేంద్రాలను సమస్యాత్మక, వాటిల్లో ఏడింటిని అతి సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఇక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. పరీక్ష సమయానికి అరగంట ముందు విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించనున్నారు. గంట ముందు చేరుకోవాలని విద్యాశాఖాధికారులు సూచిస్తున్నారు. రెండు సెట్ల ప్రశ్నపత్రాలను జిల్లా వ్యాప్తంగా 48 స్టోరేజ్ పాయింట్లలో భద్రపరిచారు. పోలీస్ బందోబస్తు నడుమ ఏరోజుకారోజు ప్రశ్నపత్రాలను సమీపంలోని పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లనున్నారు.

సిబ్బంది నియామకం ఇలా..

పరీక్షల నిర్వహణకు 1,968 మంది ఇన్విజిలేటర్లను, 174 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 174 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా 9 ఫ్లయింగ్ స్క్వాడ్, 24 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర పరిశీలకుడిగా సమగ్రశిక్ష ఏఎస్‌పీడీ రవీంద్రనాథ్ రెడ్డిని నియమించారు. ఎగ్జామ్స్ సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమీప ప్రాంతాల్లో ఉండే జిరాక్స్ సెంటర్లు, ఆన్‌లైన్ సెంటర్లను మూసివేయించనున్నారు. కేంద్రంలోకి స్మార్ట్ వాచ్‌లు, కాలుక్యులేటర్లు, సెల్‌ఫోన్లను నిషేధించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు సైతం సెల్‌ఫోన్లను తీసుకెళ్లకూడదు.



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ బాలాజీరావు

జిల్లాలో ఇలా..

పరీక్ష కేంద్రాలు	: 174
విద్యార్థుల సంఖ్య	: 33,434
సమస్యాత్మక కేంద్రాలు	: 16
సీసీ కెమెరాల ఏర్పాటు	: 7 కేంద్రాల్లో..
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు	: 9
సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు	: 24
ఇన్విజిలేటర్లు	: 1,968 మంది

పరీక్ష జరిగే సమయం : ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు
కంట్రోల్‌రూమ్ నంబర్ : 83414 08109
హాల్ టికెట్ డౌన్‌లోడ్‌కు పెట్టిన వాట్సాప్ నంబర్ : 95523 00009



మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

అధికారులతో సమావేశం

రాష్ట్ర పరిశీలకుడు రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం దర్గామిట్టలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలను సజావుగా నిర్వహించాలని తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈఓ బాలాజీరావు, ఏపీ ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ అనుముల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విద్యాశాఖ అధికారులు కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఫోన్ చేసి ఇబ్బందులు చెబితే వెంటనే స్పందిస్తారు. కేంద్రాల్లో మెడికల్ కిట్లతో ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారు. విద్యార్థులకు తాగునీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఎగ్జామ్ టైంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు

పదో తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాసేలా చర్యలు తీసుకున్నాం. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. ఎవరైనా మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ఎగ్జామ్స్ రాయాలి. గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.
– ఆర్.బాలాజీరావు, డీఈఓ

మిల్లర్ల మాయాజాలంతో నష్టపోతున్నాం

- బ్రహ్మదేవి రైతుల ఆందోళన

ముత్తుకూరు: 'బీపీటీ రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కడం లేదు. మిల్లర్ల మాయాజాలంతో తీవ్రంగా నష్టపోతున్నాం' అని మండలంలోని బ్రహ్మదేవి గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల వల్ల ధాన్యం అమ్మకం చేసే పరిస్థితి కరువైపోయిందని వాపోయారు. మూడు రోజులు ఎండలో ధాన్యం ఆరబెట్టి మిల్లర్ల వద్దకు తీసుకెళ్తే 18 శాతం తేమ ఉన్నట్టు సాకులు చూపి, నాలుగు కిలోల మేర దోచేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రెండో పంటకు తాము సిద్ధంగా లేమంటూ ప్రకటించారు. ఎన్నికలకు ముందు పాత ధాన్యం పుట్టి రూ.27,000లకు పైగా అమ్మకం చేశామని, కూటమి ప్రభుత్వంలో ధర క్రమంగా తగ్గిపోయిందన్నారు. ఈ మాయాజాలం వెనుక ఎవరి హస్తం ఉందని రైతులు ప్రశ్నించారు. ప్రస్తుతం పాత వాటి ధర రూ.20,000లకు పడిపోయిందని విచారం వ్యక్తం చేశారు.



బ్రహ్మదేవిలో మాట్లాడుతున్న రైతులు

ముగిసిన ఇంటర్ పరీక్షలు



వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఐఓ శ్రీనివాసులు



పరీక్షలు ముగిసిన ఆనందంలో..

నెల్లూరు(టౌన్): ఈనెల ఒకటో తేదీన మొదలైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు జిల్లా వ్యాప్తంగా 519 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి 23,199 మందికి గానూ 22,741 మంది హాజరై.. 458 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 431 మందికి గానూ 370 మంది హాజరై.. 61 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో ప్రశ్నపత్రాలను చింపి గాల్లోకి విసిరి సంబరాలు చేసుకున్నారు. హాస్టళ్లలో ఉంటున్న వారు సొంతూర్లకు బయలుదేరారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు సిటీ: ఆర్థిక సమస్యలో.. కుటుంబ సమస్యలో తెలియదు గానీ ఓ వ్యక్తి గడ్డి మందు తాగాడు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని నవలాకుల గార్డెన్స్‌లో నివాసం ఉంటున్న సతీష్ (40)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అతను ఎన్టీఆర్ నగర్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి పద్మావతి గ్రీన్‌సిటీలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పది సవర్ల బంగారం చోరీ



చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఈ ఘటన బుజబుజనెల్లూరు ఆర్టీసీ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఆర్టీసీ కాలనీలో రాజ్‌కిశోర్‌రెడ్డి కుటుంబం నివాసం ఉంటోంది. అతను ఈనెల 14వ తేదీన తన కుటుంబంతో తిరుమలకు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న కొంత నగదు, సుమారు పది సవర్ల బంగారు ఆభరణాలు అపహరించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బాధితులు నెల్లూరుకు చేరుకుని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో మృతదేహం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. సుమారు 40 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి ఈనెల 13వ తేదీ సాయంత్రం పప్పులవీధి పార్కు వద్ద అపస్మారకస్థితిలో ఉండగా స్థానికులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది అతడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. వీఆర్వో నాగేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96306 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా కోరారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువతి అదృశ్యమైన ఘటనపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. మాగుంట లేఅవుట్‌కు చెందిన ఓ యువతి ఫ్యాషన్ డిజైనింగ్ పూర్తి చేసి ఇంట్లో ఉంటోంది. ఈనెల 14వ తేదీన ఆమె ఇంటి నుంచి అదృశ్యమైంది. బాధిత కుటుంబసభ్యులు గాలించారు. జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూరిల్లు దగ్ధం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో శనివారం పూరిల్లు దగ్ధమైంది. వివరాలు.. గాంధీ గిరిజన కాలనీలోని పూరింట్లో కట్టా నాగయ్య కుటుంబం నివాసం ఉంటోంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంటికి నిప్పంటుకుని దగ్ధమైంది. ఈ ప్రమాదంలో వస్తువులు కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని ఆర్పివేశారు.